సాక్షి సూర్యాపేట

శుక్రవారం । 11 । అక్టోబర్ । 2024



నర్సిరెడ్డికే అవకాశం

ఎమ్మెల్సీ అభ్యర్థిగా నర్సిరెడ్డిని రెండోసారి బరిలో నిలుపుతున్నామని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు. - IIలో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం : 590 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం	: 589.10 అడుగులు
ఇన్‌ఫ్లో	: 51,133 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 51,133 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 28,907 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 10,350 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 9,076 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2,400
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం : 644.30 అడుగులు	
ఇన్‌ఫ్లో	: 1,617 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 1,706 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 170 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 243 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

23 రోజులుగా గోదావరి జలాలు



71డీబీఎంకు వస్తున్న గోదావరి జలాలు

అర్వపల్లి: గోదావరి జలాలు ప్రస్తుత వానాకాలం సీజన్‌కుగాను జిల్లాకు 23 రోజులుగా నిరంతరాయంగా వస్తున్నాయి. వారబందీ విధానం అయినప్పటికీ ఈ ప్రాంతంలో పంటలకు నీటి అవసరాల దృష్ట్యా గోదావరి జలాలను ఆపకుండా అప్పటి నుంచి విడుదల చేస్తున్నారు. జిల్లాలో 69,70,71 మూడు డిస్ట్రిబ్యూటరీలు ఉండగా మొన్నటి వరకు అన్ని డిస్ట్రిబ్యూటరీలకు నీటిని వదిలారు. ప్రస్తుతం 71డీబీఎంకు మాత్రమే 1200 క్యూసెక్కుల చొప్పున నీటిని ఇస్తున్నారు. రైతులు నీటిని వృథా చేయకుండా, కాలువలకు నష్టం కలిగించకుండా పంటలకు వాడుకోవాలని నీటిపారుదల శాఖ డీఈ ఎం .సత్యనారాయణ కోరారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం



తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు

మఠంపల్లి : మట్టపల్లి మహాక్షేత్రంలో గురువారం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాభా చార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు కల్యాణతంతును శాస్త్రోక్తంగా ముగించారు. కల్యాణంలో శ్రీనివాస చార్యులు సీత దంపతులు, అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

సబ్ కోర్టు అడిషనల్ జడ్జిగా శ్యాంసుందర్‌కు పదోన్నతి



జడ్జి శ్యాంసుందర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న న్యాయవాదులు

కోదాడరూరల్ : కోదాడ కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న శ్యాంసుందర్ భువనగిరి సబ్ కోర్టు అడిషనల్ జడ్జిగా గురువారం పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆయనను న్యాయవాది గాలి శ్రీనివాస్‌నాయుడు ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో న్యాయవాదులు వేల్పుల మోషా, మహ్మద్ హుస్సేన్, కంశెట్టి వెంకటేశ్వర్లు, మంద వెంకటేశ్వర్లు, నాగరాజు, కత్తి హరిప్రసాద్ ఉన్నారు.

• దుర్గాదేవిగా ..



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషిమాత దేవాలయంలో దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు



సూర్యాపేటలో సద్దుల చెరువు వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



నాగారంబంగ్లాలో బతుకమ్మలతో మహిళలు



నాగారం మండలం వర్ధమానుకోటలో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు

మళ్లీ.. రా గౌరమ్మా

ఊరూరా బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. గురువారం సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఆడపడుచులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. రాత్రి వరకు ఆడి పోయిరా గౌరమ్మా మళ్లీ రా అంటూ చెరువులు, కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



ఆడపడుచుల పండుగపై వివక్ష తగదు

• మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేటటౌన్ : సద్దుల బతుకమ్మ సందర్భంగా సద్దుల చెరువు(మినీ ట్యాంక్‌బండ్) వద్ద ఏర్పాట్ల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యంపై మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి మండిపడ్డారు. బతుకమ్మల వద్ద కనీసం మైకులు లేకుండా చేసి ఆడపడుచుల పండుగపై అంత అక్కస్సు ఎందుకని ప్రశ్నించారు. గురువారం రాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు వద్ద బతుకమ్మ సంబరాల్లో పాల్గొని స్వయంగా బతుకమ్మలను నిమజ్జనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతి కరుణించినా.. ప్రభుత్వానికి కనికరం లేదా అని విమర్శించారు. పండుగ పూట రాజకీయాలు మాట్లాడొద్దనుకుంటే.. మరీ ఇంత నిర్లక్ష్యమా.. అని పేర్కొన్నారు. పూలను పూజించే గొప్ప సంస్కృతి మనదని, బతుకమ్మతో మన సంస్కృతి ఖండాంతరాలకు వ్యాపించిందన్నారు. 60 ఏళ్ల అణిచివేతను.. కొట్లాడి విముక్తి చేసుకున్నామని గుర్తు చేశారు. పదేళ్లుగా పండుగలన్నీ ప్రశాంతంగా జరుపుకున్నామని తెలిపారు. బతుకమ్మ ఏర్పాట్లు సైతం తూతూ మంత్రంగా చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. బతుకమ్మను తెలంగాణ రాష్ట్ర పండుగగా గుర్తించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని ఆయన పేర్కొన్నారు. అధికార కాంగ్రెస్‌కు మన పండుగలు.. పాటలంటే పట్టింపులేదన్నారు. ప్రజలందరికీ మరోమారు బతుకమ్మ, ముందుగా దసరా శుభాకాంక్షలు తెలిపారు.

పండుగ తర్వాతే పోస్టింగ్

- డీఈఓ కార్యాలయంలో జాయినింగ్ ఆర్డర్ సమర్పిస్తున్న టీచర్లు
- జిల్లాలో 332 మంది కొత్త ఉపాధ్యాయుల ఎంపిక
- సీఎం చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్న అభ్యర్థులు
- మెరిట్ ప్రకారం పోస్టింగ్‌కు అవకాశం



సూర్యాపేటటౌన్ : ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన కల నెరవేరడంతో నూతన ఉపాధ్యాయుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ 2024 ఫలితాల్లో ప్రతిభ కనబర్చి మెరిట్ సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన.. అనంతరం ఎంపిక.. ఆ తర్వాత సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోవడం.. అన్నీ చకచకా జరిగిపోయాయి. ఇక వారికి పోసింగ్ ఇవ్వడమే మిగిలింది. ఈ ప్రక్రియ దసరా పండుగ తర్వాత కొనసాగనుంది. ప్రస్తుతం డీఈఓ కార్యాలయంలో అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీ జిరాక్స్, జాయినింగ్ లెటర్ సమర్పిస్తున్నారు.

జిల్లాలో 332 పోస్టులు..

జిల్లాలో మొత్తం విద్యాశాఖ ప్రకటించిన 386 ఖాళీలకు గాను 332 పోస్టులు భర్తీ చేశారు. అందులో 83 స్కూల్అసిస్టెంట్‌లు, 22 లాంగ్వేజ్ పండిట్‌లు, 05 పీఈటీ పోస్టులు, 222 ఎస్‌జీటీ పోస్టులు ఉన్నాయి. కాగా ఇంకా 48 స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్, ఎస్‌జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులకు సంబంధించి ఫలితాలను కోర్టు కేసుల కారణంగా వెల్లడించలేదు. ఎంపికైన అభ్యర్థులందరూ ఈ నెల 9న సీఎం చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ ఆర్డర్‌లు తీసుకున్నారు.

వెబ్ ఆప్షనా లేక ఆఫ్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారానా..

ఎంపికైన ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జాయినింగ్ లెటర్(విధుల్లోచేరుతున్నట్టు రాసి ఇవ్వాలి) సమర్పించి సంతకం చేసి వెళ్లాలని విద్యాశాఖ అధికారులు కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులకు సూచించారు. దీంతో గురువారం నుంచే వీరు డీఈఓ కార్యాలయానికి వచ్చి జాయినింగ్ లెటర్ సమర్పిస్తున్నారు. అయితే వీరికి పోసింగ్ ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్ ద్వారా ఇస్తారా లేక ఆఫ్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా ఇస్తారా అనేది ఇంకా విద్యాశాఖ ప్రకటించలేదు. మెరిట్ ప్రాతిపదికన నూతన ఉపాధ్యాయులు విద్యాశాఖ ప్రదర్శించనున్న ఖాళీల్లో తమకు నచ్చిన పాఠశాలకు వెళ్లనున్నారు. అయితే వీరికి దసరా పండుగ తర్వాతే పోసింగ్ ఇవ్వనున్నారు.

ప్రాథమిక పాఠశాలలకు ఊరట

జిల్లాలో మొత్తం 687 ఖాళీలు ఉన్నట్టు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే అందులో ఎక్కువగా 508 ఎస్‌జీటీ పోస్టులే ఖాళీగా ఉన్నాయి. ఇటీవల జరిగిన బదిలీలు, పదోన్నతుల కారణంగా పెద్ద ఎత్తున ఎస్‌జీటీ పోస్టుల ఖాళీలు ఏర్పడ్డాయి. జిల్లాలో చాలా పాఠశాలల్లో ఏకోపాధ్యాయుడే ఉన్నారు. దీంతో ప్రాథమిక పాఠశాలల్లో బోధన కుంటు పడుతోంది. ప్రస్తుతం డీఎస్సీ ద్వారా 222 మంది ఎస్‌జీటీలను భర్తీ చేశారు. దీంతో ప్రాథమిక పాఠశాలల్లో కొంత మేర ఊరట లభించనుంది. అలాగే ఉన్నత పాఠశాలల్లో కూడా సబ్జెక్టు టీచర్లు లేక ఇబ్బందులు తలెత్తాయి. విద్యార్థులకు కొన్ని సబ్జెక్టుల్లో బోధన కరువైంది. తాజాగా డీఎస్సీ ద్వారా ఎంపికైన స్కూల్ అసిస్టెంట్‌లు 83 మంది ఉన్నారు. దీంతో ఆయా పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత కూడా తీరనుంది.

మరో ముందడుగు

- నేడు తొండ గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు భూమి పూజ
- పనులను ప్రారంభించనున్న స్టేట్‌ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ రాజయ్య
- హాజరుకానున్న తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

తిరుమలగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయాలనుకున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణంలో మరో ముందడుగుపడింది. జిల్లాకు రెండు స్కూళ్లు మంజూరైన విషయం విదితమే. తిరుమలగిరి మండలం తొండ, గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేయనున్నారు. అయితే తొండ గ్రామంలోని స్కూల్‌కు స్టేట్‌ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య.. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యుడు సంకెపల్లి సుధీర్‌రెడ్డితో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. 19 ఎకరాల్లో ఈ రెసిడెన్షియల్ స్కూల్ ను నిర్మించనున్నారు. కులమతాలకు అతీతంగా విద్యార్థులంతా ఒకే చోట విద్యనభ్యసించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు పూనుకుంది.

స్థల పరిశీలన

తొండ గ్రామంలో గురుకుల పాఠశాల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని అధికారులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, ఈబీసీ గురుకులాలను నిర్మించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఈ సీతారామయ్య, డిప్యూటీ ఈఈ పద్మావతి, ఏఈ యుగేందర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై.నరేష్, శాతవాహన రావు, సుంకరి జనార్దన్ పాల్గొన్నారు.



తొండ గ్రామంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

యాదాద్రిలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. ఇక ప్రధానాలయ ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం వెండి జోడు సేవలను ఆలయ మాడవీధిలో ఊరేగించారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

12న యాదాద్రిలో శమీపూజ

యాదగిరిగుట్ట: విజయదశమిని పురస్కరించుకొని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఈనెల 12న శమీ పూజ నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ భాస్కర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆశ్వయుజ శుద్ధ దశమి రోజున సాయంత్రం 5.30 గంటలకు పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారంగా శమీ పూజలు చేసి దసరా వేడుకలను నిర్వహిస్తామన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమాలు



మాధవగూడెంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నాగార్జున్‌రెడ్డి , చిత్రంలో నాయకులు

చిలుకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం చిలుకూరు మండల పరిధిలోని మాధవగూడెంలో నిర్వహించిన సీపీఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. పేరుకు ఉచిత బస్సులు ఉన్నాయి కానీ గ్రామాలకు వెళ్లడం లేదని అన్నారు. తక్షణమే అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి మండలానికి ఒక పాలిటెక్నిక్ కాలేజీ , ఇంటర్ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం సీపీఎం మండల కార్యదర్శిగా రెండోసారి బేతవోలుకు చెందిన నాగాటి చిన రాములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు వేనేపల్లి వెంకటేశ్వర్లు, జె. నరసింహారావు, దేవరం వెంకటరెడ్డి, ముత్యాలు, బుడిగెం రామారావు, మాజీ ఎంపీటీసీ బత్తిని వెంకటయ్య, అలివేలు, వెగ్గడి లింగయ్య, నారసాని వెంకటేశ్వర్లు, పిల్లి వీరమల్లు, గట్టు లింగయ్య, కిరణ్, కోటేశ్వరరావు, లింగ మల్లయ్య, వీరస్వామి, శ్రీకాంత్, జయరాజు పాల్గొన్నారు.

వరద ముంచినా.. మారలే!

- కోదాడలో ఉలకవాగు వంతెనవద్ద తొలగించని ఆక్రమణలు
- నిబంధనలకు విరుద్ధంగా పాసింగ్ రోడ్డు నిర్మించినా పట్టని అధికారులు
- మున్సిపాలిటీ, ఆర్‌అండ్‌బీ అధికారుల మధ్య సమన్వయలోపం
- మళ్లీ వర్షం వస్తే ముంపు తప్పదంటున్న కాలనీవాసులు



కోదాడ- హుజూర్‌నగర్ రోడ్డులో వంతెనను మూసి వేసి పాసింగ్‌రోడ్డు వేసిన ప్రదేశం

కోదాడ: అధికారుల అవినీతి, రెండు శాఖల మధ్య సమన్వయ లోపం .. వెరసి కోదాడ పట్టణ ప్రజలకు శాపంగా మారింది. అధికారుల తప్పిదంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాలనీ మొత్తం ముంపునకు గురైనా జరిగిన తప్పిదాన్ని సరిచేయడానికి అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడం పట్ల పట్టణ ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణల వల్ల కాలనీకి ముంపు ఏర్పడే ప్రమాదం ఉందని ‘సాక్షి’ పలుమార్లు కథనాలు ప్రచురించినా అధికారులు మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు. భారీ వర్షాలు వచ్చి ముంపు ఏర్పడిన రెండు రోజులు హడావుడి చేసిన అధికారులు ఆ తరువాత అటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. మున్సిపాలిటీ అధికారులు అది ఆర్ అండ్ బీ శాఖ రోడ్డు కాబట్టి వారే చూడాలని చెపుతుండగా ఆర్ అండ్ బీ అధికారులు మాత్రం అక్కడ భవన నిర్మాణానికి అనుమతులు ఇచ్చింది మున్సిపాలిటీనే కాబట్టి వారే సమస్యను పరిష్కరించుకోవాలని చెబుతున్నారు.


నీరు వెళ్లకుండా పాసింగ్ రోడ్డు

కోదాడ నుంచి హుజూర్‌నగర్ వెళ్లే ప్రధాన రోడ్డును దాటుతూ ఉలకవాగు ప్రవహిస్తుంది. ఈ రోడ్డు వద్ద ఐదు ఖానాలతో వంతెన నిర్మాణం చేశారు. ఎంత వరద వచ్చినా సులువుగా నీరు కిందకు వెళ్లి ఎర్ర కుంట చెరువులో అక్కడి నుంచి కోదాడ పెద్ద చెరువులోకి వెళ్లేది. ఐదు సంవత్సరాల క్రితం ఈ వంతెనకు సమాంతరంగా పడమర వైపు ఉలక వాగులో ఒకరు మూడు అంతస్తుల భవన నిర్మాణం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ భవనానికి అనుమతులు ఇవ్వడం వెనుక నాటి కౌన్సిలర్ ముఖ్యపాత్ర పోషించినట్లు సమాచారం. ఈ భవనానికి వెళ్లడానికి వంతెన అడ్డుగా ఉండడంతో వంతెనకు ఉన్న ఐదు ఖానాలలో మూడింటిని మూసి వేసి పాసింగ్ రోడ్డు నిర్మాణం చేసినట్లు తెలిసింది. వాగులో కట్టిన భవనానికి మున్సిపాలిటీ అనుమతులు ఇవ్వగా తమ రోడ్డును ఆక్రమించి, వంతెనను మూసి వేసి పాసింగ్ రోడ్డు నిర్మాణం చేసినా ఆర్ అండ్ బీ అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి.

ఈ తప్పిదమే కాలనీని ముంచింది

సెప్టెంబర్ 1వ తేదీన కురిసిన భారీ వర్షానికి వంతెన వద్ద ఖానాలు మూసి వేయడంతో పాటు ఉన్న రెండు ఖానాలలో చెత్తా చెదారం ఇరుక్కొని పోయి నీరు కిందకు వెళ్లకుండా కాలనీలోకి వెళ్లింది. దీంతో వందల ఇళ్లు ముంపునకు గురయ్యాయి. ఇంత జరిగిన తరువాతైనా అధికారులు ఇక్కడ అక్రమంగా వేసిన పాసింగ్ రోడ్డును తొలగించడంగానీ, నీరు కిందకు వెళ్లే విధంగా చూడడంగానీ చేయలేదు. దీంతో మళ్లీ వర్షం వస్తే టీచర్ కాలనీతో పాటు శ్రీమన్నారాయణ కాలనీలలోని పలు ఇళ్లు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇరుశాఖల అధికారులు వంతెన వద్ద ఆక్రమణలను తొలగించి నీరు కిందకు వేళ్లే విధంగా చూడాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి



ఉలక వాగులో భవన నిర్మాణానికి అనుమతులు ఇచ్చిన మున్సిపల్ అధికారులతో పాటు అక్కడ వంతెనను ఆక్రమించి పాసింగ్ రోడ్డు నిర్మాణం చేసిన భవన యజమానులపై, తమ రోడ్డును ఆక్రమించినా పట్టించుకోని ఆర్ అండ్‌బీఅధికారులపై జిల్లా కలెక్టర్ కఠిన చర్యలు తీసుకోవాలి. యుద్ధ ప్రాతిపదికన వంతెన వద్ద ఆక్రమణలు తొలగించి మరోసారి కాలనీ ముంపునకు గురికాకుండా చూడాలి. –పొడుగు హుస్సేన్, సామాజిక కార్యకర్త, కోదాడ

క్లుప్తంగా

మార్చురీలో గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహాన్ని ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చినట్లు గురువారం టూటౌన్ సీఐ నాగార్జున ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న గుర్తుతెలియని వృద్ధురాలు సెప్టెంబర్ 27వ తేదీన అస్వస్థతకు గురై అపస్మారక స్థితిలో ఉండగా స్థానికులు గుర్తించి 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు. ఆమె చికిత్స పొందుతూ సెప్టెంబర్ 28వ తేదీన మృతిచెందిందని పేర్కొన్నారు. దీంతో ఆమె మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చామని, మృతురాలి వివరాలు తెలిసిన 8712670150, 9966498185 నంబర్లను సంప్రదించాలని సీఐ సూచించారు.

అక్రమంగా తరలిస్తున్న మూగజీవాల పట్టివేత

తిప్పర్తి: ఒరిస్సా రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు డీసీఎంలో అక్రమంగా 24 ఆవులు, 26 ఎద్దులను తరలిస్తుండగా తిప్పర్తి మండల కేంద్రంలో బుధవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్‌ఐ సాయిప్రశాంత్ తెలిపారు. గోవులను తరలిస్తున్న సపావత్ రాజేందర్, మద్దూరి శ్రీశైలం, చిప్పాడ అప్పారావు, సారం శీనుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. పట్టుకున్న గోవులను మాడుగులపల్లి మండలం చెరువుపల్లి గ్రామంలోని గోశాలకు తరలించినట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన



ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తున్న సీఎం కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి తదితరులు

నడిగూడెం: సూర్యాపేట జిల్లాతో పాటు ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు రైతులు బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా తెనాలి ప్రాంతంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి. గోపి, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పలువురు ఆదర్శ రైతులు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన వారిలో ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రైతు సాధికారత సంస్థ ఆధ్వర్యంలో వరి, పత్తి పంటలతో పాటు కూరగాయల సాగులో ప్రకృతి సేద్య పద్ధతులు, నేల పరిరక్షణ గురించి రైతు సాధికారత సంస్థ చైర్మన్ విజయ్‌కుమార్ వివరించారు. అనంతరం రైతులు, అధికారుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్, వ్యవసాయ విశ్వవిద్యాలయం సీనియర్ శాస్త్రవేత్త జమునారాణి, శాస్త్రవేత్త రామాంజనేయులు, వాసన్, సీఎంఓ ప్రతినిధులు రాజశేఖర్, సతీష్, నడిగూడెం మండల వ్యవసాయాధికారి దేవప్రసాద్, నడిగూడెం, మేళ్లచెర్వు మండలాలకు చెందిన రైతులు వాసికర్ల శేషుకుమార్, వెంకటరెడ్డి, రఘునాథ్ తదితరులు ఉన్నారు.

ఆడిపాడారు ఉయ్యాలో..



నల్లగొండలోని మహాలక్ష్మి అపార్ట్‌మెంట్‌లో ఐదడుగుల బతుకమ్మ



నల్లగొండ పట్టణంలోని రామాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



యాదాద్రి ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు వద్ద బతుకమ్మ వేడుకల్లో మహిళల కోలాహలం



సూర్యాపేట పట్టణంలో బతుకమ్మతో యువతి



నకిరేకల్ పట్టణ కేంద్రంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

జాతీయ రహదారులపై వాహనాల రద్దీ

- దసరా పండుగకు గ్రామాలకు తరలివెళ్తున్న పట్టణవాసులు

చౌటుప్పల్: హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ నెలకొంది. దసరా పండుగ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి ప్రజలు పెద్ద ఎత్తున గ్రామాలకు తరలివెళ్తుండడంతో ఈ రద్దీ ఏర్పడింది. రద్దీ కారణంగా వాహనాలు నెమ్మదిగా ముందుకు సాగాయి. హోటళ్లు, టీ స్టాళ్లు రద్దీగా మారాయి. గురువారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. బస్సులు, ఇతర ప్రైవేట్ వాహనాలు కిక్కిరిసిపోయాయి.

వరంగల్–హైదరాబాద్ హైవేపై కిక్కిరిసిన వాహనాలు

బీబీనగర్: గురువారం హైదరాబాద్– వరంగల్ జాతీయ రహదారి వాహనాలతో కిక్కిరిసిపోయింది. వరంగల్, హన్మకొండ, జనగామ, భూపాలపల్లి, ఆలేరు తదితర ప్రాంతాల ప్రజలు దసరా పండుగకు సొంత గ్రామాలకు తరలివెళ్తుండడంతో గూడూరు టోల్‌ప్లాజా వద్ద భువనగిరి వైపు వాహనాలు బారులుదీరాయి. గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు 40వేలకు పైగా వాహనాలు భువనగిరి వైపు వెళ్లాయి.



చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై బారులుదీరిన వాహనాలు



బీబీనగర్ గూడూరు టోల్‌ప్లాజా వద్ద వరంగల్ వైపు బారులుదీరిన వాహనాలు

దుర్గాదేవి అలంకారంలో దర్శనం

యాదగిరిగుట్ట: యాదాద్రి క్షేత్రానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం 8వ రోజు అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి ప్రాతఃకాల పూజ, అర్చనలు, పారాయణములు, గాయత్రీ జపములు, లలిత సహస్రనామార్చన చేపట్టారు. దుర్గాష్టమి పురస్కరించుకొని ఆలయంలో చండీ హవనం జరిపించారు. మధ్యాహ్న పూజ, నీరాజన మంత్రపుష్పములు నిర్వహించారు. సాయంత్రం దేవీ నవావరణ పూజ, సహస్రనామార్చన, నీరాజనం మంత్రపుష్పములు, దుర్గా స్వరూప సువాసినీ పూజలు చేశారు.



దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు

రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం లభ్యం

వేములపల్లి (మాడ్గులపల్లి): మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామ శివారులో రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మధ్యాహ్నం గుర్తుతెలియని మృతదేహం కుక్కడం రైల్వే ట్రాక్‌పై పడి ఉందని గమనించిన సిబ్బంది వెంటనే స్టేషన్ మాస్టర్ అభినవ్‌కుమార్‌కు సమాచారం అందించగా ఆయన రైల్వే పోలీసులకు విషయం చేరవేశాడు. దీంతో అక్కడికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి సుమారు 40 సంవత్సరాల వయస్సు ఉంటుందని, గతంలో చేతి మీద కోసుకున్న గుర్తులు ఉన్నాయని, ముఖం గుర్తు పట్టకుండా ఛిద్రమై ఉందని, మృతుడు బూడిద రంగు ప్యాంట్, నల్ల రంగు టీషర్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు. సదరు వ్యక్తి రైలు కింద పడి చనిపోయినట్లు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ రజిత తెలిపారు.

భర్త ప్రోత్సాహంతో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా..

పెద్దవూర: చిన్న వయస్సులోనే వివాహమై ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చినప్పటికీ పట్టుదలతో చదివి డీఎస్సీ–2024లో ఉద్యోగం సాధించింది పెద్దవూర మండల కేంద్రానికి చెందిన ఎండీ. ఖాజాబేగం. నిరుపేద కుటుంబంలో జన్మించిన ఖాజాబేగంకు ఇంటర్మీడియట్ చదువు పూర్తి కాగానే వివాహం జరిగింది. ఆమె భర్త ఎండీ. షబ్బీర్ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తున్నాడు. భర్త ప్రోత్సాహంతో వివాహం అయిన తర్వాతే ఖాజాబేగం డిగ్రీ, బీఈడీ, పీజీ చేసింది. ముగ్గురు ఆడపిల్లలు ఉన్నప్పటికీ అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తూనే కేజీబీవీలో సీఆర్‌టీగా ఎంపికైంది. అనంతరం టీజీటీ రాసి నల్లగొండ జిల్లాలో మూడో ర్యాంకు సాధించి హాలియాలోని బీసీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో హిందీ టీచర్‌గా ఉద్యోగంలో చేరి ప్రస్తుతం అక్కడే పనిచేస్తోంది. ఈ క్రమంలో సమయం దొరికినప్పుడల్లా డీఎస్సీ–2024కి స్వతహాగా ప్రిపేర్ అయ్యి జిల్లాలో హిందీ స్కూల్ అసిస్టెంట్‌లో నాలుగో ర్యాంకు సాధించి ఓపెన్ కేటగిరీలో ఉద్యోగం పొందింది. బుధవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఖాజాబేగం నియామక పత్రాన్ని అందుకుంది. అంతేకాకుండా హిందీ జూనియర్ లెక్చరర్ పోస్టుకు 1:2 నిష్పత్తిలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు సైతం హాజరయ్యింది.



ఖాజాబేగం

డ్రైవర్ నుంచి ఉపాధ్యాయుడిగా..

రాజాపేట: డ్రైవర్‌గా పనిచేస్తూ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు రాజాపేట మండలం సింగారం గ్రామానికి చెందిన దండె నరహరి, లక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు దండె రామ్మూర్తి. రామ్మూర్తి రాజాపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు చదివాడు. అనంతరం ఆర్థిక ఇబ్బందులతో చదువు కొనసాగించలేక నాలుగు సంవత్సరాల పాటు ఆటో డ్రైవర్‌గా పనిచేశాడు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న సమయంలో చదువు ప్రాముఖ్యత తెలుసుకున్న రామ్మూర్తి హైదరాబాద్‌లోని కోఠిలో ఇంటర్ పూర్తిచేసి ఓ కంపెనీలో ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ తార్నాకలోని పీజీఆర్ కళాశాలలో డిగ్రీ డిస్టెన్స్‌లో పూర్తిచేశాడు. ఆపై రెగ్యులర్‌గా బీఈడీ చదివి ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తూ ఎంఏ తెలుగు, ఎంఏ ఫిలాసఫీ, ఎంఫిల్ తెలుగు పూర్తిచేశాడు. రెండు నెలల క్రితం గురుకుల టీజీటీగా ఎంపికై ఆలేరు బీసీ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న రామ్మూర్తి డీఎస్సీ–2024లో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికై నియామక పత్రం అందుకున్నాడు.



దండె రామ్మూర్తి

అక్కాచెల్లెళ్లకు ఒకేసారి టీచర్ ఉద్యోగం

నడిగూడెం: మండల కేంద్రానికి చెందిన పందిరి కళావతి, పందిరి మల్లిక ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ–2024లో ఫలితాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. కళావతి నడిగూడెం మండల పరిధిలోని బృందావనపురం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూనే ఎస్‌జీటీ ఉద్యోగం సాధించింది. ఆమె చెల్లి పందిరి మల్లిక కూడా ఎస్‌జీటీగా ఎంపికైంది.



నియామక పత్రాలతో కళావతి, మల్లిక

నూకలుగా మార్చిన రేషన్ బియ్యం స్వాధీనం

- రైస్ మిల్లు యజమానిపై కేసు నమోదు

ఆత్మకూర్ (ఎస్): మండల పరిధిలోని పాతర్లపహాడ్ క్రాస్ రోడ్ సమీపంలో గల శ్రీలక్ష్మి మోడ్రన్ రైస్ మిల్లులో పోలీసులు గురువారం తనిఖీలు చేసి పెద్ద మొత్తంలో నూకలు, రేషన్ బియ్యాన్ని గుర్తించారు. వెంటనే సూర్యాపేట సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ నాగలక్ష్మికి సమాచారం ఇవ్వగా ఆమె మిల్లు వద్దకు వచ్చి సుమారు 100 క్వింటాళ్ల నూకలు, క్వింటాల్ రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని సివిల్ సప్లై గోదాంకు తరలించారు. ఈ మేరకు పంచనామా చేసి టెక్నికల్ అసిస్టెంట్‌తో నూకలు, బియ్యం శాంపిల్స్ తీయించారు. రేషన్ బియ్యం, నూకలు నిల్వ ఉంచినందుకు గాను మిల్లు యజమాని కాసం రమేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వై. సైదులు తెలిపారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను పోలీస్ కస్టడీకి అనుమతించిన కోర్టు

హుజూర్‌నగర్ : ప్రభుత్వ భూములను అక్రమంగా ఇతరుల పేరిట పట్టా చేసి రైతుబంధు నిధులు స్వాహా చేశారనే ఆరోపణలతో గతంలో హుజూర్‌నగర్ తహసీల్దార్‌గా పనిచేసిన జయశ్రీని పోలీసులు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ఆమె నుంచి మరింత సమాచారాన్ని రాబట్టేందుకు ఐదు రోజుల పాటు పోలీసు కస్టడీకి అనుమతించాలని కోరుతూ సీఐ చరమంద రాజు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ద్వారా హుజూర్‌నగర్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను గురువారం హుజూర్‌నగర్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మారుతీప్రసాద్ విచారించి తహసీల్దార్ జయశ్రీని శుక్రవారం ఉదయం 8:30 గంటల నుంచి సాయంత్రం 5:30గంటల లోపు విచారించేందుకు పోలీసులకు అనుమతినిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా మరో పక్క జయశ్రీ తరఫు న్యాయవాది ఆమెకు బెయిల్ మంజూరు చేయాలంటూ పిటిషన్ దాఖలు చేశారు. కాగా శుక్ర, శని, ఆదివారాలు న్యాయస్థానాలకు సెలవు దినాలు కావడంతో ఆమె దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను న్యాయమూర్తి సోమవారానికి వాయిదా వేశారు.

పూర్ణగిరి దేవాలయంలో చోరీ

భువనగిరి క్రైం: మండలంలోని నమాత్‌పల్లి గ్రామంలో గల పూర్ణగిరి స్వయంభూ సుదర్శన లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని హుండీ తాళం పగులగొట్టి దాదాపు నెల రోజుల నుంచి భక్తులు వేసిన కానుకలను ఎత్తుకెళ్లారు. కాగా ఇదే ఆలయంలో గతంలో కూడా పలుమార్లు దొంగతనాలు జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. దేవాదాయశాఖ అధికారులు ఆలయానికి నైట్ వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయాలని, పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆటోను ఢీకొట్టిన కారు.. వ్యక్తి మృతి



సైదులు (ఫైల్)

వేములపల్లి: ఆటోను కారు ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామ శివారులో నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై గురువారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శెట్టిపాలెం గ్రామానికి చెందిన సారంగి సైదులు(40) పాత ఇనుము వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం సైదులు తన ఆటోలో మిర్యాలగూడకు వెళ్లి తిరిగి రాత్రి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో అన్నపరెడ్డిగూడెం క్రాస్ రోడ్డు వద్ద నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిని క్రాస్ చేసి శెట్టిపాలెం వెళ్తుండగా నల్లగొండ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న కారు ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సైదులు ఆటోలో నుంచి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కారు అదుపుతప్పి డివైడర్ దాటి రోడ్డు అవతలి వైపు వెళ్లి మరో కంటైనర్ వాహనాన్ని ఢీకొట్టింది. స్థానికులు గమనించి సైదులును 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య సైదమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కారులో ప్రయాణిస్తున్న మిర్యాలగూడకు చెందిన కిరణ్, తన డ్రైవర్ రాఘవేంద్ర స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మరోసారి నర్సిరెడ్డికే అవకాశం ఇస్తున్నాం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, చిత్రంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంగయ్య, రవి

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంగయ్య, రవి

నల్లగొండ: యూటీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అలుగుబెల్లి నర్సిరెడ్డిని రెండోసారి బరిలో నిలుపుతున్నామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంగయ్య, చావ రవి తెలిపారు. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డితో కలిసి నల్లగొండ పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గడిచిన ఐదున్నర సంవత్సరాల కాలంలో ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డి విద్యారంగ అభివృద్ధికి, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఎంతో కృషిచేశారని అన్నారు. దీంతో ఆయనకు రెండోసారి ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు, ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషిచేశానన్నారు. ప్రభుత్వ, మోడల్ స్కూల్స్, గురుకులాలు, కేజీబీవీ, కాంట్రాక్టు జూనియర్ అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషిచేశానన్నారు. నవంబరు 6వ తేదీతో ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ ముగుస్తుందని, ఈలోగా అర్హులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తెలిపారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాములు, కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, నాగమణి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎడ్ల సైదులు, పెరుమాళ్ల వెంకటేశం, యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యాదయ్య, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు సోంబాబు, అక్కినపల్లి మీనయ్య, నాయకులు కొండయ్య, మైనార్టీ బీసీ సోషల్ వెల్ఫేర్ నాయకులు రాంబాబు, నాగరాజు, విజయ్, భరత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్ల సంఘం, పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకుల సంఘం, మోడల్ స్కూల్స్ సంఘం, 5 రకాల గురుకుల ఉపాధ్యాయ సంఘాలు, కాంట్రాక్టు అధ్యాపకుల అసోసియేషన్‌తో పాటు పలు సంఘాలు అలుగుబెల్లి నర్సిరెడ్డికి మద్దతు ప్రకటించాయి.